క్లుప్తంగా

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: లావేరు మండలంలోని సూర్యనారాయణపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి నారాయణరావు తండ్రి అప్పలనాయుడు ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ రఘు మండల కృష్ణ, కొమ్ము సాయి, సింహాద్రి, జన మహంతి శ్రీనివాసరావు, నడుపూరి ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్‌కు స్థలం కేటాయింపు



స్థలం చదును చేయిస్తున్న దృశ్యం

రణస్థలం: మండల కేంద్రంలో జేఆర్‌పురం డబ్ల్యూఎం చర్చి సమీపంలోని ప్రభుత్వ భూమిని అన్న క్యాంటిన్ నిర్వహణకు కేటాయించారు. దీంతో రణస్థలం వీఆర్వో వై.జగన్నాథం జేసీబీతో ఆ స్థలాన్ని సోమవారం చదును చేయించారు. ఈ స్థలంలో అన్న క్యాంటిన్ పెడితే అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైరు

రణస్థలం: లావేరు మండలంలో తాళ్ల వలస గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి ఈ ట్రాన్స్‌ఫార్మర్ వైరు నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. దీనివలన లో-వోల్టేజీ సమస్య వస్తోందని పేర్కొంటున్నారు. ఈ వైరు మార్చాలని గతంలో పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



వైరు నుంచి మంటలు వచ్చిన దృశ్యం

గొర్లె లక్ష్మణరావుకు సంతాపం



లక్ష్మణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దివంగత గొర్లె లక్ష్మణరావుకు నగరంలోని ఒక ప్రైవేటు భవనంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంఏ బేగ్, సీనియర్ ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్, పూజారి మన్మథరావు, గుడ్ల దామోదరరావు, శివనారాయణ, బహదూర్ జాని, పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు పంపల సీతా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పని ట్రాఫిక్ తిప్పలు



కళింగ రోడ్డులో ట్రాఫిక్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాతబస్టాండ్ వరకు, అటు సరస్వతీ మహల్ కూడలి, ఇటు ఏడురోడ్ల కూడలి నుంచి కళింగ రోడ్డు వరకు నిత్యం ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. నగరంలోకి ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం పాతబస్టాండ్‌కి వచ్చే పలు ప్రైవేటు బస్సులు నగరవాసులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీనికి తోడు ఆటోలు ఎక్కడికక్కడ నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అకస్మాత్తుగా ముందువెళ్లే వాహనాలు ఆపేయడంతో వెనుకనుంచి వచ్చి ఢీకొట్టి ప్రమాదాలకు గురై గాయాలబారిన పడుతున్నారు. నగరంలో ఏదైనా పెను ప్రమాదం జరిగితే తప్ప ఆటోలు, ప్రైవేటు బస్సులపై కఠిన చర్యలు తీసుకునే పరిస్థితి ఉండదని నగరవాసులు వాపోతున్నారు.

ఆటో భవిత ఎటో..!

- ఉచిత బస్సు ప్రయాణంపై ఆటో డ్రైవర్ల ఆందోళన
- తమను ఆదుకోవాలని వేడుకోలు



చిలకపాలేం ఆటోస్టాండ్

ఎచ్చెర్ల:

ప్రభుత్వ నిర్ణయం వారికి శరాఘాతంగా మారనుంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వారి జీవితాలను దారుణంగా దెబ్బతీయనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు సన్నాహాలు చేస్తుండంతో ఆటో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల తమ ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. లేదంటే తమ కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు.

ఫైనాన్స్‌లో కొనుగోలు

జిల్లాలో నడుస్తున్న 90 శాతం ఆటోలను డ్రైవర్లు ఫైనాన్స్‌లో కొనుగోలు చేస్తుంటారు. ఆటో ధర రూ.4 లక్షలు వరకూ ఉండగా, నెలకు సుమారు రూ.10 వేలు చొప్పున వాయిదాలు కడుతున్నారు. అలాగే ఆటో నిర్వహణకు రూ.2 వేలు, మరమ్మతులకు రూ.3 వేలు ఇలా మొత్తంగా రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. వీటితో పాటు రవాణాశాఖ అధికారుల కేసులు, ఏడాదికి బ్రేక్ ఫిట్‌నెస్ కోసం ఖర్చులు అదనం. ఈ పరిస్థితుల్లో డీజిల్ ఖర్చులు కాకుండా రోజుకు అదనంగా ఖర్చులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. అయితే ఇప్పుడు ఉచిత బస్సు వలన ప్రయాణికులు లేక ఆటోలు నడుపుతూ ఎలా జీవనం కొనసాగించాలని అంటున్నారు.

ఉపాధికి ఇబ్బందులు



ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు తప్పవు. ఆటోలకు ఫైనాన్స్‌లు కట్టలేక, కుటుంబాలను పోషించలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుంది. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పరిస్థితిపై ఆలోచన చేసి మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవాలి. ఏకపక్షంగా ఉచిత బస్సు పథకం అమలు చేయడం తగదు.

– జి.అనిల్, ఆటో డ్రైవర్, మురపాక

మహిళా ప్రయాణికులే ఎక్కువ



ఆటోలో 90 శాతం మహిళలే ప్రయాణిస్తున్నారు. వారి ద్వారానే ఉపాధి పొందుతున్నాము. ఉచిత బస్సుతో ఆటోల్లో ఎక్కేవారి సంఖ్య తగ్గిపోతే మా పరిస్థితి ఎంటి. ఉచిత బస్సుల వలన ప్రయాణికుల సంఖ్య తగ్గి అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– ఉంకుల పెంటయ్య, ఆటో డ్రైవర్, మురపాక

పక్కాగా ఈ-క్రాప్ నమోదు

జి.సిగడాం:

మండలంలోని 21 రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు పక్కాగా ఈ-క్రాప్ నమోదు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి బెండి బాబ్జీ సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారులు సాంకేతిక విధానం మూలంగా ప్రత్యేక యాప్‌లో పంటలు నమోదు చేసి, రైతు పేరు, సర్వే నంబరు, ఎంత విస్తీర్ణంలో పంటలు వేశారు, ఏఏ పంటలు వేశారు వంటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇలా చేస్తే ఖచ్చితమైన పంటల గణాంకాలు నమోదు జరుగుతుందని పేర్కొన్నారు. విపత్తులు సమయంలో పంటలు నష్టపోతే ఖచ్చితంగా పరిహారం అందేందుకు ఈ- క్రాప్ ఉపకరిస్తుందని రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సింహాద్రి లీలామోహన్, కంబాల జగదేశ్వరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో బాబ్జీ

ట్రాన్స్‌ఫార్మర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న సురేష్ కుమార్

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామంలో 76/8 సర్వే నంబర్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొంతమంది కలిసి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారని, దీనిని నిలుపుదల చేయాలని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దకర సురేష్‌కుమార్ సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తే చిన్నారులకు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చేపట్టిన పనులను నిలుపుదల చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విశ్వసాహితీ సంస్థ పత్రిక ఆవిష్కరణ

ఎచ్చెర్ల: యువతకు తెలుగు భాషపై ఆసక్తి పెంచే లక్ష్యంతో సరికొత్తగా ఏర్పాటైన విశ్వ సాహితీ సంస్థ ఆవిష్కరణ మహోత్సవ పత్రికను సోమవారం ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో డైరెక్టర్ బాలాజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి మునిరామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, గేదెల రవి, ముకుందరావు, చిరంజీవి, వేమన, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణకు ముందడుగు



విద్యార్థులు తయారు చేసిన సీడ్‌బాల్స్ చూపుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ కోసం రోటరీ క్లబ్ శ్రీకాకుళం ముందడుగు వేసినట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు బరాటం శ్రీనివాస తెలిపారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం మరియు శ్రీశ్రీ ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఇన్‌స్పైరా స్కూల్ విద్యార్థులకు జీవ వైవిధ్యం మీద ప్రకృతి వ్యవసాయ ఉపాధ్యాయులు దార్లపూడి రవికుమార్ పర్యవేక్షణలో అవగాహన కల్పించారు. అనంతరం విత్తన బంతులు తయారు చేయడం నేర్పించారు. విద్యార్థులతో తయారు చేసిన విత్తన బంతులను రోటరీ ప్రతినిధుల ద్వారా అటవీ ప్రాంతాలు, నదీ ప్రవాహక ప్రాంతాలు, బంజరు భూముల్లో జల్లడం ద్వారా పచ్చదనం పెంపొందించి పర్యావరణ పరిరక్షణకై కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కిల్లాన శ్రీనివాసరావు, ప్రతినిధులు అన్నెపు అనంతరావు, జైశ్రీరామ్, దూసి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా.. జాగ్రత్త



సీది వద్ద పాలంలో కర్రలకు విద్యుత్ వైర్లను అమర్చిన దృశ్యం

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటర్లతో అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకే ముప్పు..
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట

పాతపట్నం:

ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే రైతులు తమ పొలాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. పంటలకు నీరు పెట్టడం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ తీగలు, మోటార్ల వద్ద ఎక్కువగా పని చేస్తుంటారు. రైతులు చిన్న, చిన్న విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు వహించకపోతే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. పొలాల్లో వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్తలు ఇలా..

స్టార్టర్ డబ్బాలను మోటార్‌కు పక్కన పొలంలో ఉంచి కవర్లు కప్పుతుంటారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉంటుంది. వర్షం కురిసినా, బోరు నీరు ఎగజిమ్మినా డబ్బాల్లోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫీజుదో కూడా తెలియకుండా ఉంటుంది. నేరుగా స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫీజు అమర్చుకోవాలి. స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి. చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుప డబ్బాల్లో స్టార్టర్, ఫీజులు బిగించడంతో ఎలుకలు డబ్బాలో చేరి తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకోగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.



కొరసవాడ సమీపంలో పంట పొలంలో పైపుల ద్వారా పారుతున్న బోరు నీరు

జాగ్రత్తలు ఇలా..

- పొలాల్లో మోటార్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు.
- టెస్టర్ సహాయంతో మాత్రమే పరీక్షించాలి.
- వర్షపు నీరు, తేమ తగలని చోట వీటిని అమర్చాలి.
- ఎర్త్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.
- విద్యుత్ మోటర్‌లో అంతరాయం ఏర్పడితే ముందు విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.
- ఫీజులు పోతే విద్యుత్‌శాఖ అధికారుల సహాయంతో వాటిని మరమ్మతులు చేయించుకోవాలి.

విద్యుత్ తీగలతో ప్రమాదం..

గాలలకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగించుకుని వైర్లను ఇంటికి తీసుకువస్తారు. ఇంట్లో వైర్లు ఉంచినప్పుడు ఎలుకలు కొరికే అవకాశం ఉంది. మరుసటి రోజు మోటార్ వైర్లు తగిలించేటప్పుడు వాటిని సరి చూసుకోవాలి. పాతవైర్ల కంటే కొత్త వైర్లు బిగించుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న పొలాల్లో కొంత మంది కర్రల సహాయంతో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి వర్షానికి, గాలికి కింద పడుతుంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లోకి వెళితే కాళ్లకు తగిలి విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులతో మాట్లాడి స్తంభాలను ఏర్పాటు చేయించుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



వర్షానికి తడిచిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను తాకవద్దు. కరెంట్ వైర్లను తాకుతున్న చెట్లను ముట్టుకోవద్దు. పొలాల్లో స్టార్టర్లను మరమ్మతుల చేయించుకోవాలి. స్వయంగా ఫీజులు వేయడం వంటి చిన్న, చిన్న పనులు చేయవద్దు. పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడితే విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిచేయించుకోవాలి. విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జి.ప్రసాదరావు, డీఈఈ, విద్యుత్‌శాఖ, పాతపట్నం

ఏడాది పాలన మోసాలమయం



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన మోసాలమయమని వైఎస్సార్‌సీపీ కళింగ వైశ్య కుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 11వ డివిజన్ హెచ్‌బీ కాలనీలో జేఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠం అధ్యక్షతన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదోడిని దోచుకునేందుకు విద్యుత్ షాక్‌నిచ్చిందన్నారు. స్మార్ట్ మీటర్లు, సర్ చార్జీల పేరుతో ప్రజలనెత్తిన విద్యుత్ బిల్లుల భారం మోపుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని, సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు మాట్లాడుతూ కూటమి పాలనలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, పి.సుగుణారెడ్డి, కింజరాపు రమేష్, సీపాన రామారావు, ఖాన్, ఎ.త్రినాథ్ రెడ్డి, యడ్ల వెంకట్, తోట తారక్, రుప్ప శేషగిరిరావు, పార్టీ నియోజకవర్గ గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, తేజ, శిల్లా వైకుంఠం, కిల్లి నాగు, రంగాజీ దేవ్, చందు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న బలగ ఉత్తరేశ్వరస్వామి



ఉమారుద్రకోటేశ్వరునికి అలంకరణ



నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి

నగరంలోని గుడివీధిలో బలరామ ప్రతిష్ట దేవాలయమైన ఉమారుద్రకోటేశ్వర స్వామివారికి శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూజలు చేశారు. అదేవిధంగా నక్కవీధిలో ఉన్న ఉమా జఠలేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పూజలు చేశారు. అలాగే బలగలోని ఉత్తరేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

శ్రీకాకుళం కల్చరల్

వరుసక్రమంలో నాట్లు వేయడంతో మేలు



సరుబుజ్జిలి: వరుసక్రమంలో వరినాట్లు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సరుబుజ్జిలి: వరుస క్రమంలో వరినాట్లు వేయడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ సూర్యనారాయణ అన్నారు. రావివలస గ్రామంలో రైతు తిరుపతిరావు వ్యవసాయ క్షేత్రంలో వరుస క్రమంలో వరినాట్లు వేసే విధానం గురించి రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. వరుస క్రమంలో నాట్లు వేయడం వలన సూర్యరశ్మి తగిలి దోమ, చీడపీడల నుంచి రక్షించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ టీమ్ డీఎంఎంటీ సురేష్, ఐసీఆర్పీలు తిరుపతిరావు, సుమ, పూర్ణారావు పాల్గొన్నారు.

వరి నారు చిగుర్లు తుంచి నాట్లు వేయాలి..

కొత్తూరు: వరి నారు చిగుర్లు తుంచి వరుస క్రమంలో నాట్లు వేయాలని కొత్తూరు డివిజన్ ప్రకృతి వ్యవసాయ ఎంటీ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరుకు చెందిన బి.చిన్నంనాయుడు పొలంలో లైన్ షోయింగ్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



పాతపట్నం: కూరగాయలు విక్రయిస్తున్న ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది



హిరమండలం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

పాతపట్నం: స్థానిక కోర్టు కూడలిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆర్‌వైఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయోత్పత్తులను సోమవారం విక్రయించారు. మండలంలోని గంగువాడ, తీమర, కొరసవాడ గ్రామాల్లో ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ముల్లంగి, టమాటా, చిక్కుడు, వంకాయలు, కొత్తిమీర, ములగ, బియ్యం, తదితర పంటలను విక్రయించారు. ఆర్‌వైఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు..

హిరమండలం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగుచేసే ఉత్పత్తులు ఎంతో శ్రేయస్కరమని ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగుచేసిన బీర, కాకర, పొడుగు చిక్కుడు, వంగ, బెండ, దొండ, తోటకూర, గోంగూర, బ్రౌన్ రైస్ వంటి ఉత్పత్తులను మండల కార్యాలయం వద్ద సోమవారం విక్రయించారు. ఐసీఆర్పీలు పాల్గొన్నారు.